# వర్గీకరణపై మాలల మండిపాటు

సీఎం దిష్టిబొమ్మల దహనం



ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఖలీల్‌వాడి/కోటగిరి, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిజామాబాద్ జిల్లాలో మాల కులస్తులు గురువారం ఆందోళనలు నిర్వహించారు. నిజామాబాద్ నగరంతో పాటు కోటగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. నగరంలోని ధర్నాచౌక్‌లో రాస్తారోకో నిర్వహించిన మాల మహానాడు నేతలు సీఎం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 సర్వే ప్రకారం కాకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు ప్రతినిధులు ఎడ్ల నాగరాజు, అంగరి ప్రదీప్, అలుక కిషన్, జిల్లా మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు ఆనంపల్లి ఎల్లయ్య, నాంది వినయ్‌కుమార్, కోశాధికారి నీలగిరి రాజు, ఉదయ్ కుమార్, సి.దేవదాస్, స్వామిదాస్, ప్రభాకర్, బొడ్డ నర్సింగ్ నాయకులు పాల్గొన్నారు.

**కోటగిరిలో..**


ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉమ్మడి కోటగిరి మండలాల మాల మహానాడు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షుడు మిర్జాపురం చిన్న సాయన్న మాట్లాడుతూ 2024 సర్వే ప్రకారం కాకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడమేమిటని ప్రశ్నించారు. బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల ప్రతినిధులు కాలే సాయిలు, జంగం సాయిలు, పాల గంగారాం, సుంకిని సాయిలు, మోరే జీవన్, నగేశ్, సతీశ్ పాల్గొన్నారు.



కోటగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

**కాంగ్రెస్ పార్టీ తీరుపై** బడుగులు భగ్గుమంటున్నారు. కుల గణన, రిజర్వేషన్లు సహా అనేక హామీల అమలులో మోసం చేసిన అధికార పార్టీపై నిప్పులు చెరుగుతున్నారు. ఎన్నికలకు ముందు డిక్లరేషన్ల పేరిట అన్ని వర్గాలపై కాంగ్రెస్ వరాల జల్లు కురిపించింది. అదే క్రమంలో బీసీలను సైతం మచ్చిక చేసుకునేందుకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అమలు చేస్తామని మాట ఇచ్చిన హస్తం పార్టీ 15 నెలలు దాటినా అమలు చేయకుండా ధోకా చేసింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి వారి ఓట్లతో ముఖ్యమంత్రి అయ్యారు. కానీ వారికి రిజర్వేషన్లు ఇవ్వకుండా 'చేయి'చ్చారు. చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తామన్న రేవంత్‌రెడ్డి.. 42 శాతం రిజర్వేషన్ పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని, అక్కడ ఒప్పుకుంటేనే అమలు చేస్తామని మెలిక పెట్టడంపై బీసీ వర్గాలు మండిపడుతున్నాయి. 15నెలలుగా ఆశ పెట్టి ఇప్పుడు చేతులెత్తేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

–మోర్తాడ్, ఫిబ్రవరి 6




# భగ్గుమంటున్న బడుగులు

- కుల గణన లెక్కలపై పెల్లుబికుతున్న అసహనం
- బీసీ జనాభా తగ్గుదలపై అనుమానాలు
- 42 శాతం రిజర్వేషన్లపైనా స్పష్టతనివ్వని సర్కారు
- కేంద్రం ఒప్పుకుంటేనే అని మెలిక పెట్టిన రేవంత్
- మండిపడుతున్న వెనుకబడిన వర్గాలు
- 'కామారెడ్డి డిక్లరేషన్' అమలు ఏమైందని నిలదీత

**ఎన్నికల సమయంలో** అన్ని వర్గాలపై హామీల వర్షం కురిపించి అధికారం దక్కించుకోవాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అలవి కానీ హామీలెన్నో ఇచ్చింది. అందులో భాగంగానే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభ పెట్టి కుల గణన చేస్తామని, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని బడుగులను నమ్మించింది. కానీ, ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయకుండా మోసగించిన తరహాలోనే కాంగ్రెస్ బీసీల ఆశలపై నీళ్లు చల్లింది. బీసీ రిజర్వేషన్ల అమలుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని చేతులెత్తేయడం వెనుక కాంగ్రెస్ కుట్ర దాగి ఉందని బీసీ వర్గాలు మండిపడుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ పాలనలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానాలు చేసి పంపించినా కేంద్రం నుంచి ఏ ఒక్క దానికీ అనుమతి రాలేదు. ఇప్పుడు రిజర్వేషన్ల తీర్మానాన్ని కూడా కేంద్రం ఆమోదించదని తెలిసే రేవంత్ సర్కారు కొత్త నాటకానికి తెర తీసిందనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం ఆమోదించకపోతే తామేమీ చేయలేమని తప్పించుకోవాలన్నదే కాంగ్రెస్ ఎత్తుగడ అని వెనుకబడిన వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ చెప్పినట్లు రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, కాంట్రాక్టుల కేటాయింపుల్లోనూ రిజర్వేషన్లు, బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ.20 లక్షల కోట్ల కేటాయింపు, ప్రతి మండలంలో బీసీ గురుకులాలు, మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు సహా మిగతా బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేదాకా వదలబోమని బీసీ నేతలు హెచ్చరిస్తున్నారు.

**కులగణన కుతంత్రమేనా**

వాస్తవానికి కుల గణన చేపట్టే అధికారం కేంద్రానికే ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళా రాష్ట్రాలు చేసినా ఆ గణంకాలకు చట్టబద్ధత ఉండదని, అమలు చేసే అవకాశం కూడా లేదని గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ కుల గణన అంటూ హడావుడి చేయడం, రిజర్వేషన్లు అంటూ ఊదరగొట్టడం కుట్రలో భాగమేనని బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అంతే కాకుండా కులగణన సమయంలో చాలా ఇండ్లకు ఎన్యుమరేటర్లు రాలేదని, మొక్కుబడిగా సర్వే ముగించారని మండిపడుతున్నాయి. తాజాగా ప్రకటించిన కులగణన నివేదిక వివరాలు అనేక సందేహాలకు తావిస్తున్నాయి. పదేండ్లలో తెలంగాణలో పెరిగిన జనం కేవలం 2 లక్షలేనని చెప్పడం, బీసీ జనాభా పెరుగుదల 11.4 లక్షలే అనడం, ఎస్సీలు తగ్గిపోవడం, అగ్రకులాల జనాభా పెరిగనట్లు చూపడం వంటివి అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కుల గణన, రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ తీరు బీసీ వర్గాలను కావాలనే మోసం చేస్తున్నదని బడుగు బలహీనవర్గాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.



## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

జనగణన పేరిట బీసీ వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ప్రభుత్వం ప్రకటించిన గణంకాలే చెప్తున్నాయి. కుల గణన తప్పుల తడకగా ఉందని, ప్రామాణికత లేకుండా సర్వే చేశారన్నది స్పష్టమవుతున్నది. 42 శాతం మాత్రమే బీసీలు ఉన్నారని చెప్పడంలో కుట్ర దాగున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ప్రజలు, రైతులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నది.

**- సుభాస్‌గౌడ్, గౌడసంఘం నాయకులు, కమ్మర్‌పల్లి**

## చెప్పిందేంది.. చేస్తున్నదేంది?



కామారెడ్డి, వరంగల్ లో ప్రకటించిన డిక్లరేషన్ సభల్లో మీరు చెప్పిందేమిటి, ఇప్పుడు చేస్తున్నదేమిటి? బీసీ డిక్లరేషన్ సభలని చెప్పి బీసీల ఓట్లు వేయించుకుని గద్దెనెక్కి ఇప్పుడు బీసీల గొంతు నొక్కుతుండ్రు. ప్రభుత్వం ప్రకటించిన బీసీల లెక్కల్లో తప్పులున్నాయి. బీసీలకు ఎక్కడా న్యాయం జరుగుతలేదు. బీసీలంతా ఏకం కావాలె. బీసీ డిక్లరేషన్ సభల్లో చెప్పిన హామీలన్నీ అమలయ్యే వరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలె. బీసీలకిచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ సర్కారును నిలదీయాలె.

**- పర్స దేవన్న, మున్నూరుకాపు నాయకుడు, దోన్‌పాల్**

## హామీలు ఎటుపోయినయ్?



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మస్తు హామీలిచ్చింది. డిక్లరేషన్ల పేరిట సభలు పెట్టి వరాలు కురిపించింది. వంద రోజుల్లోనే అన్ని చేస్తామని చెప్పింది. రైతులు, బీసీల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు అన్ని హామీలు అమలు చేయాలి. రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం తప్పించుకునే ప్రయ త్నం చేస్తున్నట్లు కనిపిస్తున్నది. స్థానిక సంస్థల్లో చెప్పినట్లుగానే కచ్చితంగా రిజర్వేషన్లు అమలు చేయాలి. హామీల అమలులో కాంగ్రెస్‌కు నిబద్ధత లేదు. బీసీల విషయంలోనైనా చెప్పిన మాటను నిలబెట్టుకోవాలి.

**- శ్రీకాంత్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ, బాల్కొండ**

## 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి..



కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గుతున్నట్లుగానే అనిపిస్తున్నది. రిజర్వేషన్ల అమలులో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు అర్థమవుతున్నది. రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ఆమోదం తెలపాలనే కొత్త నాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెర మీదకు తేవడం సర్కారు చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తున్నది. కుల గణనపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. బీసీల జనాభా తగ్గుడేందో అర్థమైతలేదు. దామాషా ప్రకారం బీసీలకు అవకాశాలు ఇవ్వాలి. 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే. బీసీల సంక్షేమం కోసం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలి.

**- మూత లింబాద్రి, బీసీ సంక్షేమ సంఘం మాజీ మండల అధ్యక్షుడు, భీమ్‌గల్**

# 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్




వినతిపత్రం అందజేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నేతలు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 6: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశా రు. కేంద్రం లో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. బీసీ సంక్షేమాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు నిధులు కేటాయించాలని విన్నవించారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు అందించాలని, బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మించాలని సమితి ప్రతినిధులు చక్రపాణి, రాధాకుమార్, రమేశ్, సాయి తదితరులు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

# అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

ప్రభుత్వ వైఖరిపై వీఆర్‌ఏల నిరసన

మాక్లూర్/భీమ్‌గల్, ఫిబ్రవరి 6: ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అడగడానికి వెళ్లిన వారిని అరెస్టు చేయడం సిగ్గుచేటని వీఆర్‌ఏలు మండిపడ్డా రు. మాక్లూర్, భీమ్‌గల్ సహా పలు మండలాల్లోని తహసీల్ కార్యాలయాల ఎదుట గురువారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వీఆర్‌ఏల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలుపుతుంటే అక్రమంగా అరెస్టు చేయడం సరి కాదన్నారు. జీవో నం.81, 85 ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వారి వారసులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించినా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాలయాపన చేయకుండా వీఆర్‌ఏల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు ఆసదు భాస్కర్, బేగరి ముత్తెన్న, కమలాకర్, వినేష్, నరేశ్, సాయన్న, కొండయ్య పాల్గొన్నారు.




భీమ్‌గల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు



# జీవధార కరువై.. పొలాలు ఎడారై..

**పదేండ్ల పాటు పచ్చదనంతో** వికసించిన నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ఇప్పుడు కళ తప్పుతున్నది. కేసీఆర్ పాలనలో ఆయకట్టుకు దండిగా నీళ్లు ఇవ్వడంతో పుట్ల కొద్దీ వడ్లు పండించిన రైతాంగం ఇప్పుడు చిన్నబోతున్నది. కండ్ల ముందే ఎండిపోతున్న పొలాలను చూసి కన్నీరు పెడుతున్నది. జీవధార కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నది. నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీళ్లు అందక బీర్కూర్ మండలంలో దామరంచ గ్రామ శివారులో గల వరి పైర్లు ఎండుతున్నాయి. పొలాలు బీటలు వారుతున్నాయి. పదేండ్ల పాటు ఏ ఇబ్బందులూ లేకుండా పంటలు సాగు చేసిన రైతులు కాంగ్రెస్ రాకతో వచ్చిన కష్టాలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పొలాలకు నీళ్లందివ్వాలని దీనంగా వేడుకుంటున్నారు.

– నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 6

## ఎఫ్ఆర్వో హత్య కేసులో
# ఒకరికి జీవిత ఖైదు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గంగయ్య హత్య, అటవీ సిబ్బందిపై హత్యాయత్నం కేసులో ఒకరికి రాష్ట్ర హైకోర్టు జీవిత ఖైదు విధించింది. మిగతా 13 మందిని నిర్దోషులుగా విడుదల చేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ధర్పల్లి మండలం నల్లవెల్లి గ్రామ శివారులోని పెద్దబండ వద్ద గల అటవీ భూములను ట్రాక్టర్లతో చదును చేస్తున్నారన్న సమాచారంతో 2013 సెప్టెంబర్ 14న అర్ధరాత్రి ఇందల్వాయి ఎఫ్ఆర్వో గంగయ్య (42) తన సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడున్న వారు దాడి చేయగా గంగయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఏడుగురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు 37 మందిని నిందితులుగా పేర్కొంటూ చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన నిజామాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు 14 మంది ముద్దాయిలకు జీవిత ఖైదు విధిస్తూ 2017 సెప్టెంబర్ 25న తీర్పు వెలువరించింది. జీవిత ఖైదు పడిన నల్లవెల్లి గ్రామానికి చెందిన ప్రధాన ముద్దాయి వడ్డె భాస్కర్‌తో పాటు మిగతా 13 మంది హైకోర్టులో అప్పీలు చేశారు. ఈ అప్పీల్‌ను విచారించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన దోషిగా తేలిన భాస్కర్‌కు జీవిత కారాగార శిక్ష ఖరారు చేసింది. మిగతా 13 మందిని నిర్దోషులుగా విడుదల చేస్తూ అప్పీల్‌ను పరిష్కరించింది. నిజామాబాద్ ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టులో జరిగిన నేర న్యాయ విచారణనే ప్రామాణికంగా పరిగణిస్తూ హైకోర్టు తీర్పు వెలువడడం జిల్లా న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చిందని సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

# వేధింపులతో మహిళల్లో అభద్రత




పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- అతివల ప్రగతికి ప్రతిబంధంగా పనిచేసే చోట వేధింపులు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6: మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారు. కానీ వారు పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెరిగిపోవడం అతివల ప్రగతికి ప్రతిబంధకంగా మారుతున్నదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. వేధింపులు, దాడులు మహిళల్లో అభద్రత పెంచి పోటీ ప్రపంచంలో వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తాయన్నారు. నిజామాబాద్ నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన 'మహిళలు పనిచేసే చోట జరుగుతున్న లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు'లో జిల్లా జడ్జి మాట్లాడారు. స్త్రీలపై లైంగికదాడికి పాల్పడినా, శారీరకంగా సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేసినా, మహిళల పట్ల అశ్లీల పదజాలం వాడినా, శారీరకంగా, మానసికంగా వేధించినా అవి లైంగిక వేధింపు కిందకు వస్తాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళలు పది మంది, అంతకంటే ఎక్కువగా ఉన్నట్లయితే అక్కడ ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుష్బు ఉపాధ్యాయ, ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ, జిల్లా సంక్షేమాధికారి రసూల్‌బీ, కంప్లెయింట్ అథారిటీ చైర్‌పర్సన్ నీరజారెడ్డి, అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, డీసీపీ రామచంద్రారావు, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.